# అసంపూర్ణ రామాయణం

## ( జీవితం )

జ్ఞానం లేకపోవడమే అజ్ఞానం. సముద్రపు లోతు ఎంతో మనకు తెలియదు. అలాగే ఆకాశం ఎంత ఎత్తో కూడా మనకు తెలిసిరావదు. అన్నీ తెలిసిన వారంటూ ఎవరూ వుండరు. అందుచేత ఎవరికైనా ఏ విషయంలోనైనా తెలిసిన దాని కంటె తెలియనిదే ఎక్కువ వుంటుంది. మనకు తెలిసినవీ, తెలియనవీ ఏవిటి అనే నిర్ధారణకు ఒక జీవిత కాలం కూడా సరిపోదనుకుంటాను.

భారతం చదివారా?

అయ్యో చదవలేదండీ-

అయ్యో భారతమే చదవలేదా?

ఏం చేస్తాం చదవలేదు. నిజమే—సిగ్గుగా వుంటుంది.

* * * *

మొన్న కచ్చేరీకి వెళ్ళారా?

ఏ కచ్చేరీ?

బాలమురళీకృష్ణ కచ్చేరీ?

బాలమురళీకృష్ణ ఎవరూ?

అయ్యో బాలమురళీకృష్ణే తెలీదా?

నిజం మీ మీదొట్టు....

వేళాకోళానికైనా హద్దూ పద్దూ వుండాలి.

నాకు తెలీదు అంటూంటే—

పాట కచ్చేరీకి మీరు రాలేదా గొప్ప ఛాన్స్ పోగొట్టుకున్నారు లైఫ్‌లో—

ఏం చేస్తాం—నాకు తెలీదే

బాలమురళీకృష్ణ గురించి తెలియకపోవటం క్షమించరాని నేరం. ఆ ఆర్టిస్టు గొప్పదనం తెలుసుకోవటానికి నా జీవితం కాలం సరిపోదేమో-నాకు పైమేదీ?

*   *   *   *

పథేర్ పాంచాలీ చూశారా?

పథేర్ పాంచాలీ చూడ్డమేమిటి?

అదే సత్యజిత్ రాయ్ ట్రయో—

సత్యజిత్ రాయెవడూ?

మూడు గొప్ప చిత్రాలు తీశారు-గొప్ప డైరెక్టర్—గొప్ప ఆర్టిస్టు....

ఒక్క సినిమా చూశా-గొప్ప తలనొప్పండీ బాబూ-ఒక డాన్స్‌లేదు ఒక ఫైట్‌లేదు, ఒక సాంగ్‌లేదు-పరమ బోరు కదా—

ఎంత రియలిస్టిక్‌గా తీశాడు?

ఎందుకు తీయాలి?

చాప్లిన్ సినిమాలు చూశారా పోనీ—

చూశ్శేదండి బాబూ-రౌడీ రంగడూ. భార్యా భర్తలు, దెబ్బకు తా దొంగల ముఠా చూశానండీ బాబూ-

మంచి పిక్చర్లొచ్చినపుడు చూడ్డం మానకండి.

మంచి పిక్చర్లెవో మనకు తెలీదు. మంచి పిక్చర్ల కోసం ఎన్ని చెత్త పిక్చర్లు చూడాలో—మనకంత తీరికేది? అంతమంది కలిసి తీసిన చిత్రం



బాగులేదు బాగుందీ అని చెప్పటానికి ఎంత నాలెడ్జి కావాలో – అది మన దగ్గర ఎక్కడుంది? ఆ నాలెడ్జి సంపాయించే సరికి సినిమాలు చూడ్డానిక దృష్టి తగ్గిపోతుంది. ఇవన్నీ ఎక్కడ స్టడీచేస్తూ కూర్చుంటాం – అవతల ఇల్లూ సంసారాలూ బరువులూ బాధ్యతలూ-వాటి నెవరు చూస్తారు?

• • •

బొంబాయి వెళ్ళారా?

లేదు.

కలకత్తా వెళ్ళారా?

లేదు.

మద్రాసు చూశారా?

చూడలేదు.

బెంగుళూరు వెళ్ళారా?

అబ్బే—

ఊటీ, మైసూరు, త్రివేండ్రం, రామేశ్వరం, కంచి వెళ్ళలేదా?

ఎవిటోనండీ—కాలుతీసి వీధిలో పెట్టలేదు. యాత్రలు చెయ్యాలండీ దేశమంతా తిరిగి చూడకపోతే ఎట్లా?

ఏం చూస్తాం? టిక్కెట్ చార్జీతో...పైగా హైరాణా. కదిత్తే డబ్బు కావాలి గదా?

మరెల్లాగ - డబ్బులేదని తిరగడం. తిరిగిజ్ఞానం సంపాదించటం మానుకుంటాంటండీ—

ఎందుకొచ్చిన జ్ఞానం పోనిస్తురూ-కడుపులో నీళ్ళు కదలకుండా ఇంట్లో కూర్చొని రామాకృష్ణా అనుకుంటూంటే రోజువెళ్ళిపోతాయ్. దేవుడెక్కడ లేడు? అంతటూ వున్నాడు. ఎక్కడో వున్నాడంటూ వెతుక్కుంటూ వెళ్ళడం శుద్ధదండగ. కళ్లు మూసుకుంటే మందికాదు.

బాగుందండీ—నాలుగుచోట్లకు తిరగడం నలుగురిని చూడడం లోకజ్ఞానం పెరగటం మంచిది కదా!

ఓపికుండాలండీ-ఇన్ని తిప్పలెవరు పడతాడు?

అంతే నంటరా?

అంతే-ఇండియా అంతా తిరిగితే అమెరికా వెళ్ళలేదనుంటుంది. అమెరికా వెళ్తే అయ్యో చైనా, జపానుదేశాలు చూశాంకామే అనిపిస్తుంది మంగళగిరి వెళ్ళితే అమరాతి విళ్ళలేదనిపిస్తుంది. ఎక్కడికేవారి-సంతుష్ట

దీరేడు జగముల పూజ్యుండు సంతోషికెప్పుడు జరుగు సుఖము అన్నారు మనవాళ్ళు.

మీ బోటివాళ్ళు గడప దాటకపోతే లోకం గురించి తెలుసుకునే దెట్లా?

"పోనిస్తురూ...."

* * *

రవ్వ కేసరి యటం చేవచ్చా సీతగారూ?

రాదు

హల్వా?

రాదు

గులాబ్ జామ్?

రాదు

మరేం వచ్చూ?

పప్పొండటం వచ్చు. చింతకాయ తొక్కుటం వచ్చు. జంతిక లొచ్చు. చేగోడీలు వండటంవచ్చు. గారెలొండుతాను. ఆవడలు నానేస్తాను. ఇడ్లీ— బజ్జీలూ పకోడీలూ, దోసెలూ పెసరట్లూ, పూరీలు యివి ఒస్తే చాలదా?

నేనడిగింది స్వీట్సు?

బూరెలు, మైసూర్ పాక్, లడ్డూలూ చేస్తాను. పరవాణ్ణం వొండుతాను.

ఉత్తరదేశపు వంటలేవీ రావా?

రావండీ. ఎన్నని నేర్చుకోగలం?

ఇష్టంలేదా?

అబ్బే- అన్నీ తింటాను, తిండం వేరూ వండి చూపించటం వేరు గదా— మనవేమన్నా పెద్ద మిఠాయి దుకాణం పెట్టబోతున్నామా ఇవన్నీ వండటం నేర్చుకోటానికి—— అయినా రాదు. మన తెలివితేటలే అంత.

*　　　*　　　*

టైలరింగ్ వచ్చా?

వచ్చు.

బ్లవుజులు ఫ్రాకులు లంగాలు చిన్న చిన్న వన్నీ కుడతారా?

కుడతాను.

బెల్‌బాటమ్స్ కుట్టగలరా?

గలను.

షర్ట్సూ నిక్కర్సూ ప్యాంట్లూ

కుట్టకేం?

మరైతే అంతా సేవ్ చేస్తున్నారన్న మాట.

సేవ్వూ లేదు సేమ్యా లేదు.

మరేవిటి?

నేను కుట్టినవి ఎవరూ తొడుక్కోరు.

ఎందుకని?

వాళ్ళకు నచ్చవ్.

ఎందుకు నచ్చవ్?

నేను సరిగ్గా కుట్టలేదు కనుక—

అదేవిటి?

కుట్టుపని చాలా సున్నితమైనది. అది టైలరులా కుట్టడానికి ఒక

జనరేషన్ ఎఫర్ట్ కావాలి. దోభీలా మనం వాష్ చెయ్యగలమా దుస్తులు. ఇదీ అల్లానే-

సరై తే ఎందుకు నేర్చుకున్నారు?

నేర్చుకోవడం కష్టమని తెలుసుకుందుకు.

బలే వారండీ.

అవును మీరూ బలేవారే.

ఇహ్హిహి.

ఇహ్హిహి.

టా టా.

బై బై